సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 20 । జూన్ । 2025

I



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - IIలో



అభిషేక జల సంప్రోక్షణ..

యాదగిరిగుట్ట ఆలయంలో భక్తులకు అభిషేక జల సంప్రోక్షణ, హారతిచ్చేలా చర్యలు చేపట్టాలని ఈఓ వెంకట్రావ్ కోరారు. - IIలో



నియామకాలు చేపట్టాలి

ఆలయాల్లో రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని టీఎస్‌జీఓల సంఘం సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కోరారు. - IIలో

న్యూస్‌రీల్

24వ తేదీన డ్రా

భానుపురి (సూర్యాపేట) :2025 – 26 విద్యాసంవత్సరానికి గాను జిల్లా పరిధిలోని ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఒకటవ తరగతి డే స్కాలర్, ఐదవ తరగతి రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 24వ తేదీన డ్రా తీయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. దయానందరాణి తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 24న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో చదువుకునేందుకు ఆసక్తి ఉన్న ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, జైనుల పిల్లలు సీఎం ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ అధికారి జగదీశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. జనవరి 2025 నుంచి జూన్ 30వ తేదీ మధ్యకాలంలో అడ్మిషన్ తీసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు, ధ్రువపత్రాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, ఈ పథకం కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ కింద రెండు విడతల్లో రూ.20 లక్షలు, విమాన ప్రయాణం చార్జీలు రూ.60 వేలు చెల్లించనున్నట్లు వివరించారు. ఈనెల 30తేదీ వరకు దరఖాస్తుచేసుకోవచ్చని సూచించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం నిర్వహించారు. కల్యాణవేడుకల భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం , మధుపర్కపూజ, మాంగళధారణ, తలంబ్రాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం గరుడవాహనంపై శ్రీస్వామివారిని ఆలయ తిరుమాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



ఆలయంలో నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలను నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు జరిపించారు. భక్తులు వివిధ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి

మునగాల : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగోటి రంగా కోరారు. గురువారం మునగాల మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మొగిలిచెర్ల సత్యనారాయణ, రావులపెంట రాజబాబు, గండు నారాయణ, మేకపోతుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వికాసం.. ఆలస్యం!

సందిగ్ధంలో రాజీవ్ యువవికాసం లబ్ధిదారులు

- జూన్ 2వ తేదీనే చెక్కుల పంపిణీ అంటూ హడావుడి
- అర్ధంతరంగా నిలిపివేత
- మండల స్థాయిలోనే కొలిక్కిరాని ఎంపికలు
- జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు 60,304



రుణం	యూనిట్లు లక్ష్యం	వచ్చిన దరఖాస్తులు
రూ. 50వేలు	5,477	886
రూ. లక్ష	4,139	1431
రూ. 2లక్షలు	3537	7361
రూ. 2–4 లక్షల వరకు	3,429	50,602
ఎస్సీకార్పొరేషన్ రుణం	156	24

భానుపురి (సూర్యాపేట) : రాజీవ్ యువవికాసం యూనిట్ల మంజూరులో సందిగ్ధత నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 16,738 యూనిట్లు లక్ష్యం కాగా 60,304 దరఖాస్తులు వచ్చాయి. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొంతమందికి మంజూరు పత్రాలు ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మండల స్థాయిలోనే ఓ కొలిక్కి రానట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం యూనిట్ల మంజూరు పత్రాల పంపిణీని నిలిపివేసింది. ఇప్పుడు వీరందరికీ ఎదురుచూపులు తప్పడం లేదు.

60,304 దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 16,738 మందికి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 16,738 యూనిట్ల లక్ష్యానికి ఏకంగా 60,304 యూనిట్ల కోసం దరఖాస్తులు రావడంతో మండల స్థాయిలో ఎంపిక చేయాలని నిర్ణయించారు.

కొలిక్కిరాని జాబితాలు..

రుణాల కోసం వచ్చిన దరఖాస్తుల నుంచి మండల స్థాయిలోనే అర్హుల జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. ఈ జాబితాలు జిల్లాస్థాయికి పంపిస్తే .. అక్కడ బడ్జెట్ అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కానీ మండల లెవల్ కమిటీలు తుది జాబితాలను పూర్తి చేయడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఈ కమిటీలో ఎంపీడీఓ, మండల స్థాయి డీఆర్‌డీఏ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది ఉండగా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఇంకా తుది జాబితాలు సిద్ధం కాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో జాబితాలు ఎప్పుడు పూర్తవుతాయి..? మంజూరు పత్రాలు ఎప్పుడు ఇస్తారోనని దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది :

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు. ఇంకా తుది జాబితా కూడా పూర్తికాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తాం.

–శ్రీనివాస్‌నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ



ఇందిరమ్మ ఇంటి వద్ద లబ్ధిదారులతో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే పద్మావతి

20 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- విభళాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

నడిగూడెం : వచ్చే మూడున్నరేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మోతె మండలం విభళాపురంలో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంతో పాటు విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. 4.50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 3.70లక్షల మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో కమీషన్‌లు తీసుకొని, అధికారాన్ని దుర్వినియోగం చేసి, నేడు సోషల్ మీడియాలో ఇందిరమ్మ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేబినెట్ మంత్రుల సహకారంతో రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే అభివృద్ధిని గాడిలో పెడుతున్నామన్నారు. వచ్చే ఏ ఎన్నికలైనా విజయం ఇందిరమ్మ ప్రభుత్వందేనని ధీమా వ్యక్తం చేశారు.

ఆగస్టు15నాటికి భూ సమస్యలన్నీ పరిష్కారం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా పరుగెడుతున్నాయని మంత్రి అన్నారు. విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత పాలకులు పదేళ్లు పాలించి ఒక్క ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. భూ భారతిచట్టం ద్వారా వచ్చే ఆగస్టు 15 నాటికి భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ప్రజల సంక్షేమం కోసం ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.12 వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సేవలు, ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు ఇలా పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి మాట్లాడుతూ విభళాపురం గ్రామాన్ని పైలట్‌ప్రాజెక్టు కింద ఎంపిక చేసి తొలి విడత 146 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టిన 74 మంది లబ్ధిదారులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవరావు, గృహనిర్మాణ శాఖ పీడీ ధర్మారెడ్డి, తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ ఆంజనేయులు, గృహనిర్మాణ శాఖ ఏఈ నాగరత్నమ్మ పాల్గొన్నారు.



ఇంటి పనులు ప్రారంభించిన లబ్ధిదారుడికి దుస్తులు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నడిగూడెం : విభళాపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కేక్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

యాదవులకు మంత్రి పదవి లేకపోవడం బాధాకరం



ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ తదితరులు

సూర్యాపేట : యాదవులకు తెలంగాణ ప్రభుత్వంలో మంత్రి పదవి లేకపోవడం బాధాకరమని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ పేర్కొన్నారు. యాదవ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న యాదవ ఆత్మగౌరవ ధర్నా పోస్టర్‌ను గురువారం సూర్యాపేట పట్టణంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేబినెట్ యాదవ మంత్రులు లేకుండా ప్రభుత్వాలు లేవని గుర్తు చేశారు. రాష్ట్ర జనాభాలో 28 లక్షల మంది యాదవులు ఉన్నప్పటికీ మంత్రి పదవి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 10 కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏమైందని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పని అయిపోతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడింగ్ గోవర్దన్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు మేకల కృష్ణ, అఖిలభారత యాదవ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్, ప్రధాన కార్యదర్శి తూము వెంకన్న యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తగుల జనార్దన్ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు సుంకరబోయిన వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ గుడ్డేటి సైదులు యాదవ్, కోడి లింగయ్య యాదవ్, బడుగుల సైదులు యాదవ్, కంచుగట్ల జానయ్య యాదవ్, నాగార్జున యాదవ్, సైదులు యాదవ్, కాసం రాము యాదవ్, ఉగ్గం నగేష్ యాదవ్ ఉన్నారు.

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా వెంకటరమణ



కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కాపుగల్లుకు చెందిన ముత్తవరపు వెంకటరమణ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) వారు బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఎంపిక చేశారు. ఇండియాలో ఫార్మసీ విద్యను అభివృద్ధి చేయడం, కొత్త కళాశాలల మంజూరుతో పాటు రెన్యువల్ చేయడంలో కీలకపాత్ర పోషించనున్నారు. ముత్తవరపు భాస్కర్‌రావు, కుమారి దంపతుల కుమారుడు వెంకటరమణ 10వ తరగతి వరకు కోదాడ సెయింట్ జోసెఫ్ సీసీరెడ్డి పాఠశాలలో, ఇంటర్ విజయవాడ విశ్వశ్రీ కళాశాలలో , బీఫార్మసీని కర్ణాటకలో, ఎం ఫార్మసీ అన్నామలై యూనివర్సిటీలో, పీహెచ్‌డీ నాగార్జున యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఆయన ప్రస్తుతం మొయినాబాద్ లోని ఆజాద్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గా, నేషనల్ ఫార్మసీ టీచర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనను డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, కాపుగల్లు మాజీ సర్పంచ్ సతీష్, పీఏసీఎస్ చైర్మన్ సూర్యం, రిటైర్డ్ హెచ్‌ఎం రామారావు, హనుమంతరావు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగయ్య

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి తీగల నాగయ్య సూచించారు. గురువారం సూర్యాపేట మండలం పిన్నాయిపాలెంలో మాదగోని రమేష్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ సాగు చేసినట్లయితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటనాటిన నాలుగవ సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఎకరానికి రూ. 4,200 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకంగా ఇస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ తెలంగాణ డివిజనల్ మేనేజర్ బి. యాదగిరి, మేనేజర్ జె. హరీష్, జూనియర్ మేనేజర్ శశి కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, క్షేత్ర సహాయకులు యానాల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాషయ్య, సుధాకర్, డ్రిప్ ప్రతినిధి మోహన్ పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగయ్య

ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి



సూర్యాపేట పట్టణంలో ఇజ్రాయిల్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న నేతలు

సూర్యాపేట అర్బన్ : ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని నిలిపి శాంతిని నెలకొల్పాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ దాడులు చేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద ఇజ్రాయిల్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకుడు బూర వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా నాయకుడు కోట గోపి, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్‌కే నజీర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్ అణ్వాయుధాలు ఉన్నాయనే పేరుతోఈ నెల 13నుంచి ఇరాన్‌పై క్షిపణి దాడులు చేసిందని, ఆయిల్ కంపెనీల పైన, నివాసాలపైన బాంబులు వేయడం మూలంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలతో లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు మన దేశానికి తిరిగి చేరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు గంట నాగయ్య, వరికుప్పల వెంకన్న, చెరుకు ఏకలక్ష్మి, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, అలుగువెల్లి వెంకటరెడ్డి, పోలబోయిన కిరణ్, పుల్లూరి సింహాద్రి, దనియాకుల శ్రీకాంత్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

డుమ్మా కొట్టడం కుదరదిక!

- జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల ఉద్యోగులకు ఫేస్ రికగ్నైజేషన్ హాజరు
- సిబ్బంది వివరాలు సేకరించే పనిలో ఉన్నతాధికారులు
- రోజూ రెండు పర్యాయాలు హాజరు నమోదు
- హాజరు మిషన్‌కు జీపీఎస్ అనుసంధానం



నాగారం : జిల్లా, మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులకు ఇక నుంచి ఫేస్ రికగ్నైజేషన్ హాజరు అమలుకానుంది. ప్రస్తుతం రిజిస్టర్‌లో పేర్లు రాస్తుండటంతో కొందరు విధులకు హాజరు కాకపోయినా నమోదు చేసుకుంటున్నారు. ఆలస్యమైనా సమయానికి వచ్చినట్లు హాజరు వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ అవకతవకలను అరికట్టడానికే ఈ కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఉద్యోగుల సమయపాలన, హాజరు సమయాలు పక్కాగా ఉండేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ విధానం అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని 23 మండలాలు, ఒక జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా ఫేస్ రికగ్నైజేషన్ హాజరు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది.

పూర్తి స్థాయి సేవలు..

ఈ విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పక్కాగా అమలయ్యే అవకాశం ఉంటుంది. సంక్షేమ పథకాల అమలులో మండల స్థాయి అధికారులు కీలకపాత్ర పోషిస్తారు. గ్రామం నుంచి మండల స్థాయి వరకు అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు సక్రమంగా ఉంటే ఫలాలు ప్రజలకు అందుతాయి. మండల పరిధిలోని ప్రభుత్వ పంచాయతీరాజ్, గృహనిర్మాణ, ఉపాధిహామీ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓల పర్యవేక్షణ కీలకం. సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్ల హాజరు కూడా ప్రభావం చూపుతుంది. కార్యాలయాల్లో వీరి సమయపాలన, హాజరుతో పథకాలు పరుగులు పెడతాయి. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా పర్యవేక్షణ ఉండనుంది.

ఉద్యోగుల వివరాల సేకరణ..

జిల్లాలోని 23 మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో సుమారు 12 నుంచి 15 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో సుమారు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గతంలో వేలిముద్రల హాజరు విధానం కార్యాలయాల్లో సరిగ్గా అమలు కాలేదు. సంబంధించిన పరికరాల మరమ్మతుల కారణంగా కొద్దిరోజుల అనంతరం వాటిని మూలన పడేశారు. ఫేస్ రికగ్నైజేషన్ హాజరు నమోదుకు ఉద్యోగులు, అధికారుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఉద్యోగుల ఆధార్ కార్డులోని వివరాలు సేకరిస్తున్నారు. విధులకు హాజరు.. ఇంటికి వెళ్లే సమయాల్లో రెండుసార్లు ఫేస్ రికగ్నైజేషన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. హాజరు యంత్రానికి జీపీఎస్‌ను అనుసంధానం చేయనున్నారు. హాజరు నమోదు వివరాలు రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి

జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో ఫేస్ రికగ్నైజేషన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీనిని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ కొత్త విధానంతో ఉద్యోగుల సమయపాలన పక్కాగా ఉంటుంది.

– కె.యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి

మహాసభను జయప్రదం చేయాలి

అర్వపల్లి : చివ్వెంల మండలం దురాజ్‌పల్లి లింగమంతులస్వామి దేవాలయం సమీపంలో ఈ నెల 26న జరిగే గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడెం లింగయ్య, వీరబోయిన రవి కోరారు. గురువారం అర్వపల్లిలో మహాసభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. గొల్ల కుర్మలకు గొర్రెల యూనిట్లను ఒక విడత ఇచ్చి వదిలేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో వజ్జె వినయ్‌యాదవ్, లింగమల్లు, ఆంజనేయులు, వీరపాపయ్య, లింగయ్య, వెంకన్న, సోమయ్య, సాలయ్య, పెద్దలింగయ్య, విజయ్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి

కోదాడరూరల్ : ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి పేర్కొన్నారు. గురువారం కోదాడ మండలం రామలక్ష్మీపురంలో నూతనంగా ఏర్పాటు చేసి పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం నిర్వహించిన సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లారావు, నాయకులు నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, కన గాల నారాయణ, వెంకటేష్‌బాబు, పురుషోత్తం, జనార్దన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

భువనగిరి ఖిలా టికెట్ ధరలు పెంపు



భువనగిరి ఖిలా

భువనగిరి: భువనగిరి ఖిలా సందర్శనకు టికెట్ ధరలను పెంచుతూ తెలంగాణ హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం ఖిలా సందర్శనకు గాను పెద్దలకు గతంలో రూ.10 టికెట్ ఉండగా.. ప్రస్తుతం రూ. 20కు పెంచారు. అదేవిధంగా పిల్లలకు గతంలో రూ.5 టికెట్ ఉండగా.. ఇప్పుడు రూ.10కు పెంచారు. మిగిలిన ధరలు యాథావిధిగా ఉన్నాయి. గతంలో సందర్శకుల ద్వారా వచ్చిన ఆదాయం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖకు వెళ్లేది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వచ్చిన ఆదాయాన్ని మ్యూజియం నిర్వహణ, రికార్డుల నిర్వహణ కోసం ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల అడ్డగింత



బస్సులను అడ్డుకున్న ఏపూరు గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్): ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏపూరు గ్రామం నుంచి సూర్యాపేటలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ బస్సులను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. లక్షల్లో ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల బస్సులు తమ గ్రామానికి రావొద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను పిలిపించి కొందరు గ్రామస్తులు తమ పిల్లలకు ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను నల్లగొండ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం ఒక రోజు జైలు శిక్ష తోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదాబాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్వానంగా కాల్వలు



ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారిన శాలిగౌరారం ప్రాజెక్టు కుడి కాలువ



కంపచెట్లు, చెత్తాచెదారంతో నిండిన పంట కాలువ

- కంప చెట్లు, చెత్తాచెదారం, మురుగునీటితో నిండిన శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు
- ఆందోళనలో ఆయకట్టు చివరి రైతులు

శాలిగౌరారం: ఉమ్మడి జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులలో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు అధ్వానంగా మారాయి. ప్రధాన కాల్వలు దెబ్బతినడం, ప్రధాన కాల్వలపై ఉన్న పంట కాల్వల తూములు, షట్టర్లు పూర్తిగా ధ్వంసం కావడంతో సాగునీరు వృథాగాపోతుంది. అంతేకాకుండా కాల్వల్లో కంపచెట్లు, చెత్తాచెదాం నిండడడంతో ఆయకట్టు చివరికి సాగునీరందడం కష్టంగా మారుతోంది. దీంతో ఆయకట్టు చివరి భూముల రైతులు సాగునీరు కోసం నానా అవస్థలు పడుతున్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటి నిల్లవ సామర్థ్యంతో 6వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 19 అడుగుల మేర నీరు ఉంది.

సాగునీరందేది 6 కి.మీ. మాత్రమే..

శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల మొత్తం పొడవు 12 కిలోమీటర్లు. అందులో కుడి కాల్వ పొడవు 6.5 కిలోమీటర్లు, ఎడమ కాల్వ పొడవు 5.5 కిలోమీటర్లు. దశాబ్దాల కాలంగా ప్రధాన కాల్వలు మరమ్మతులకు నోచుకోకవడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం ఒకొక్క కాల్వ ద్వారా గరిష్ఠంగా 3 కిలోమీటర్ల వరకు కూడా సాగునీరు ప్రవహించని పరిస్థితి. ప్రధాన కాల్వల వెంట అక్రమంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి ఎగువ ప్రాంతానికి నీటిని తరలించడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది.

మురుగునీటితో కష్టంగా పూడికతీత..

కుడి, ఎడమ ప్రధాన కాల్వలు నిత్యం డ్రెయినేజీ నీటితో నిండి ఉంటున్నాయి. కుడి కాల్వలోకి తిరుమలరాయునిగూడెం, బాలిశెట్టిగూడెం, మార్కెట్ కాలనీ, పావురాలగూడెం గ్రామాల నుంచి డ్రెయినేజీలను కలిపారు. అదేవిధంగా ఎడమ కాల్వకు రామగిరి గ్రామం నుంచి వచ్చే డ్రెయినేజీని కలిపారు. దీంతో కుడి, ఎడమ కాల్వలు నిత్యం మురుగునీటితో నిండి ఉండటంతో కనీసం ఉపాధి హామీ పథకంలో భాగంగా కాల్వలను పూడిక తీసేందుకు కూలీలు ముందుకు రావడంలేదు. రైతులు సొంత ఖర్చులతో జేసీబీల సహాయంతో కాల్వలలో పూడిక తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సీసీ లైనింగ్‌తో ఆధునీకరించాలి



శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలను సీసీ లైనింగ్‌తో పూర్తిస్థాయిలో ఆధునీకరించాలి. అప్పుడు ప్రాజెక్టు సాగు నీరు వృథాకావడం, అక్రమంగా నీటిని ఎగువకు తరలించడం పూర్తిగా నిలిచిపోవడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుంది. పేరుకే ప్రాజెక్టు ఆయకట్టులో ఉన్నాం. కానీ ఏనాడు చివరి భూములకు సాగునీరందిన దాఖలాలు లేవు.

– కట్టా వెంకట్‌రెడ్డి, రైతు, అడ్లూరు

పూడికతీతకు నిధులు లేవు



శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల్లో పూడిక తీసేందుకు నీటి పారుదలశాఖలో నిధులు లేవు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే తప్ప ప్రత్యేకంగా నిధులు వెచ్చించే పరిస్థితి నీటిపారుదలశాఖకు ఉండదు. ప్రస్తుతం వానాకాలం సాగు నేపథ్యంలో రైతులే తమ సొంత ఖర్చులతో కాల్వల్లో పూడికతీత పనులు చేయించుకోవాలని కోరుతున్నాం.

– సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ, శాలిగౌరారం ప్రాజెక్టు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- నలుగురు దొంగల అరెస్ట్

సూర్యాపేటటౌన్: తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె. నరసింహ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఇటికాల ఫణిచంద్, కోదాడకు చెందిన నాగేంద్రబాబు, మరో ఇద్దరు బాలురు జల్సాలకు అలవాటుపడి రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన సొత్తును అమ్మేందుకు కోదాడ పట్టణానికి రాగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఎనిమిది తులాల బంగారం, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఫణిచంద్ వివిధ పోలీస్ స్టేషన్లలో 17 కేసులు ఉన్నాయని, గతంలో జైలుకు వెళ్లి కూడా వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఫణిచంద్, నాగేంద్రబాబును రిమాండ్‌కు తరలించగా.. ఇద్దరు బాలురను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుక్ను కోదాడ పోలీసులను ఎస్పీ అభినందించారు



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ

ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య



మాట్లాడుతన్న నాగయ్య

మునగాల: రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య డిమాండ్ చేశారు. గురువారం మునగాల మండలంలోని కొక్కిరేణి గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూమిలేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చి.. 16నెలలు గడుస్తున్నా నేటికీ ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని, భూభారతిలో అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేను వెంటనే రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న ప్రభుత్వ భూములన్నింటిని పేద వ్యవసాయ కార్మిక కుటుంబాలకు పంచాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు కొదమగుండ్ల నగేష్, జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సొంపంగు జానయ్య, పోసనబోయిన హుస్సేన్, గుంజ వెంకటేశ్వర్లు, షేక్ సైదా హుస్సేన్, నారసాని వెంకటేశ్వర్లు, జంపాల స్వరాజ్యం, గుండు సైదులు, ఆరె రామకృష్ణారెడ్డి, దోసపాటి భిక్షం పాల్గొన్నారు.

ట్రాక్టర్ తిరగబడడంతో రైతు మృతి

తిప్పర్తి: పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడడంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెంలో గురువారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి (51) ట్రాక్టర్‌తో గురువారం పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బురదలో దిగబడింది. బురదలో నుంచి ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో ట్రాక్టర్ తిరగబడింది. దీంతో వెంకట్‌రెడ్డి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ రాంమూర్తి తెలి పారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి..



వీరస్వామి (ఫైల్)

నూతనకల్: ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం పరిధిలోని పెద నెమిల గ్రామ పంచాయతీలో గురువారం జరిగింది. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద నెమిల గ్రామ పంచాయతీకి చెందిన గంగుల వీరస్వామి(50) అదే గ్రామానికి చెందిన జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం వ్యవసాయ పొలంలో వీరస్వామి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా.. బండరాయిని ఎక్కడంతో అదుపుతప్పి వీరస్వామి ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడు కమలాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న టీఎన్‌జీఓల సంఘం సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు జగదీష్

యాదగిరిగుట్ట: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో పనిభారం తగ్గించేందుకు గాను ఖాళీగా ఉన్న పోస్టుల్లో రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని టీఎన్‌జీఓల సంఘం సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీష్ ప్రభుత్వాన్ని కోరారు. యాదగిరిగుట్టలోని పాత గోశాలలో గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగులు, సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాన దేవాలయాల ఉద్యోగులకు హెల్త్ కార్డులు, పీఆర్‌సీ అనుమతించి, రాబోయే ప్రభుత్వ జీఓలో ప్రత్యేకంగా పొందుపరచాలన్నారు. జీఓ నంబర్ 888ను దేవాలయాల్లో ఉన్న పోస్టులకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సవరణ చేయాలని, జీఓ నంబర్ 261ని సవరించాలన్నారు. పదవీ విరమణ దగ్గర్లో ఉన్న ఉద్యోగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో తమ తమ మాతృ సంస్థలకు బదిలీ లేదా డిప్యూటేషన్‌పూ పంపాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. అనంతరం ప్రధాన దేవాలయాల్లో ఉద్యోగులు ఎదుర్కొటున్న సమస్యల పరిష్కారం, ఉద్యోగులకు అవసరమ్యే అంశాలపై చర్చించారు. త్వరలోనే దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్‌బాబు, టీఎన్‌జీఓల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముజీబ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేష్, ముక్కెర్ల సత్యనారాయణ, జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, ఆయా దేవాలయాల అధ్యక్షులు వి. శ్రీనివాస్‌రెడ్డి (భద్రాచలం), కూరగాయల శ్రీనివాస్ (వేములవాడ), సుదర్శన్ (బాసర), మల్లికార్జునస్వామి (కొమురవెల్లి), చందు (కొండగట్టు), దూశెట్టి కృష్ణ, దయానంద్ (యాదగిరిగుట్ట), 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులకు అభిషేక జల సంప్రోక్షణ, హారతి

- ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన యాదగిరిగుట్ట ఈఓ వెంకట్రావ్



యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు, అధికారులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి ప్రధానాలయంలో అభిషేక జల సంప్రోక్షణ, హారతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆలయ ప్రధానార్చకులకు, అధికారులకు ఈఓ వెంకట్రావ్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆలయ అధికారులు, అర్చకులతో ఈఓ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్వామివారి అంతరాలయములో వెళ్లే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులను ధరిస్తేనే అనుమతి ఇవ్వాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో శని, ఆదివారాల్లో సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులు స్వయంగా వస్తేనే ప్రొటోకాల్ దర్శనం కల్పించబడుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ప్రొటోకాల్ దర్శనము వారందరూ టికెట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. భక్తుల్లో భక్తి భావం పెంపొందించేందుకు శ్లోకములు, వాటి అర్థాలను వివరిస్తూ బోర్డులు, పెయింటింగ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా దేవస్థాన భద్రతకు సంబంధించి పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేసి అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎస్‌పీఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అధికారులు దయాకర్ రెడ్డి, రామారావు, రాజన్‌బాబు, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ శేషగిరిరావు తదితరులున్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పీఎన్‌డీ ప్రసాద్

మిర్యాలగూడ: ఆటో చోరీ కేసులో నిందితుడిని గురువారం దామరచర్లలో పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన వెంపటి శ్రీనివాస్ ఈ నెల 7వ తేదీ రాత్రి 10గంటల సమయంలో తన ఆటోను తన దుకాణం ముందు ఉంచి ఇంటికి వెళ్లి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడు ఈ నెల 11న వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని బుడిగజంగాల కాలనీకి చెందిన పెల్లూరి ఆంజనేయులు గురువారం దామరచర్ల చెక్‌పోస్టు వద్ద దొంగిలించిన ఆటోలో వస్తుండగా.. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పిడుగురాళ్లకు చెందిన కొండపల్లి ఆంజనేయులు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎంజీయూలో యోగా డే బ్రోచర్ విడుదల

నల్లగొండ టౌన్: ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ యోగా డే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, డాక్టర్ పసుపుల మద్దిలేటి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, శ్రీదేవి, షరీఫ్, శేఖర్, వీరస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ప్రొఫెసర్లు

ప్రభుత్వ బడిలో కుమారుడిని చేర్పించిన టీచర్



కుమారుడికి అడ్మిషన్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు మణిరాజ్ (ఆకుపచ్చ రంగు షర్ట్ వ్యక్తి)

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ఆదిమల్ల మణిరాజ్ తన కుమారుడు సత్యరాజును అదే పాఠశాలలో 10వ తరగతిలో గురువారం చేర్పించారు. 9వ తరగతి ప్రైవేట్ స్కూల్‌లో చదివిన తన కుమారుడిని 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంతో మణిరాజును పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యా బోధన చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లేపల్లి కాశయ్య తెలిపారు.

వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడి



గుర్రంపోడు : గతంలో రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేవారు. కాలానుగుణంగా పంటలు అధిక దిగుబడి సాధించడం కోసం రైతులు రసాయన ఎరువులు వాడడం మొదలు పెట్టారు. రసాయన ఎరువుల మోతాదును పెంచుకుంటూ పోవడంతో ఏర్పడిన దుష్ఫలితాలను గ్రహించిన రైతులు మళ్లీ సేంద్రియం వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ ఎరువు వాడడం వల్ల రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువంటే పశువుల ఎరువే కాదు..జీవన ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు కూడా వస్తాయి. వర్మీ కంపోస్టు తయారీపై అనుముల ప్రాంతీయ ఉద్యానవన శాఖ అధికారి మురళి అందిస్తున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

రైతు మిత్రులుగా వానపాములు

వ్యవసాయ వ్యర్థ పదార్థాలతో తయారయ్యే వర్మీ కంపోస్టు ముఖ్యమైన సేంద్రియ ఎరువుగా చెప్పవచ్చు. పురాతన కాలం నుంచి వానపాములను రైతు మిత్రులుగానే పరిగణిస్తాం. ఈ వానపాములు పాక్షికంగా కుళ్లిన వ్యర్థ పదార్థాలను తిని విసర్జించిన పదార్థాన్నే వర్మీ కంపోస్టు అంటారు.

పాడి–పంట

వర్మీ కంపోస్టు తయారీ విధానం

- మూడు అడుగుల వెడల్పుతో కావలసిన పొడవు వరకు ఒక్కో బెడ్ చొప్పున లభించే వ్యర్థ పదార్థాలు, స్థలాన్ని బట్టి బెడ్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఈ బెడ్‌ను వర్షపు నీరు, సూర్యరశ్మి, అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడడానికి పైన తాటాకు పందిర్లతో లేదా రేకులతో కప్పు నిర్మించాలి.
- బెడ్ అడుగు భాగంలో సిమెంట్‌తోగాని, పేడతోగాని అలికి గట్టిగా ఉండేలా చూడాలి.
- అడుగు భాగం నుంచి 10 సెం.మీ ఎత్తు వరకు పాక్షికంగా కుళ్లిన వ్యర్థ పదార్థాలను వేయాలి. దీనిపై పలుచగా నీరు చల్లాలి.
- ఆ తర్వాత మళ్లీ మరో వరుస 15–30 సెం.మీ మందంలో సేంద్రియ వ్యర్థ పదార్థాలు, కుళ్లిన కూరగాయలు వేసుకోవచ్చు. దీనిపైన పలుచగా నీరు పెట్టి, వరి గడ్డితోగాని, పాత గోనె సంచులతోగాని కప్పి ఉంచాలి.
- ఈ బెడ్‌కు ప్రతిరోజు పలుచగా నీరు పెడుతూ ఒక వారం రోజుల తర్వాత ఒక చదరపు మీటరుకు 1000 వానపాముల చొప్పున వదలాలి. ప్రతిరోజు నీరు పెడుతూ అప్పుడప్పుడు బెడ్‌ను కదిలించాలి.
- బెడ్‌లలో వేసిన వ్యర్థ పదార్థాలు అదే రూపంలో లేకుండా తేలికగా, నల్లగా, వాసన లేకుండా ఉండే పదార్థంగా ఏర్పడినట్లయితే వర్మీ కంపోస్టు తయారైనట్లుగా భావించవచ్చు.
- ఈ దశలో నీరు పెట్టడం ఆపేస్తే వానపాములన్నీ బెడ్‌ల అడుగు భాగానికి చేరుతాయి.

వర్మీ కంపోస్టు వల్ల ఉపయోగాలు

- నేలలో సేంద్రియ కర్బనం పెంచుతుంది.
- భూ భౌతిక రసాయన పరిస్థితులను మెరుగుపరుస్తుంది.
- భూసారాన్ని పరిరక్షిస్తూ ఉత్పాదకతను పెంచుతుంది.
- భూమిలో గాలి ప్రసరణ, నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెంచుతుంది.
- పోషకాల లభ్యత పెంచడంలో మొక్క సులభంగా గ్రహించడంలో తోడ్పతుంది.
- పండ్ల తోటల్లో ఒక చెట్టుకు 5 కిలోలు, పూల కుండీల్లో 250 గ్రాములు వర్మీ కంపోస్టు వాడుకోవచ్చు.

- ఆ తర్వాత పైన ఉండే వర్మీ కంపోస్టును జల్లడ పట్టినట్లయితే వర్మీ కంపోస్టు వస్తుంది.
- అనంతరం వానపాములను మరో బెడ్‌లోకి వదలాలి.

జాగ్రత్తలు

- సేంద్రియ వ్యర్థ పదార్థాలు వేసేటప్పుడు దానిలో ప్లాస్టిక్ కవర్లు, గాజు పెంకులు వంటివి లేకుండా చూసుకోవాలి.
- బెడ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.